క్లుప్తంగా

ఎంపీడీఓగా కె.శ్రీదేవి బాధ్యతల స్వీకరణ



ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ కే.శ్రీదేవి

దెందులూరు: దెందులూరు ఎంపీడీఓగా కే శ్రీదేవి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కామవరపుకోట నుంచి బదిలీపై ఆమె దెందులూరు వచ్చారు. దెందులూరు మండల పరిషత్ పరిపాలనాధికారులు ఎం.భీమరాజు, వై. శ్రీదేవి సీనియర్ అసిస్టెంట్, కె కనకరాజు జూనియర్ అసిస్టెంట్, రాధాకృష్ణ దోసపాడు నాయకులు గోరింక ఏసోబు, మేడూరి వెంకటేశ్వరరావు, నెరుసు గంగరాజు, బొల్లె రాము, అత్తులూరి శ్రీను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

వీఆర్వో సింహాచలం సేవలు ఆదర్శనీయం



పోలసానిపల్లి వీఆర్వో సింహాచలంను సత్కరిస్తున్న సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు

భీమడోలు: పోలసానిపల్లి వీఆర్వో డి.సింహాచలం ఉద్యోగ విధుల్లో అందించిన సేవలు ఆదర్శనీయని సర్పంచ్ షేక్ రహీమాబేగం అన్నారు. పోలసానిపల్లి పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఐదేళ్లు పని చేసి గుండుగొలను వీఆర్వోగా బదిలీపై వెళ్తున్న డి.సింహాచలంను ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. సభకు కార్యదర్శి జయరామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా సర్పంచ్ షేక్ రహీమాబేగం హాజరయ్యారు. పెద్దలు షేక్ హసేనా, మద్దు శ్రీను బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ ఎస్సై టీఎస్ రంగారావు, సార్జెంట్ కె.వెంకటేష్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డు వద్ద వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో 10మంది మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడ్డారు. పది మందిపై కేసు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు సోమవారం ఏలూరు ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు వారిని హాజరుపర్చామన్నారు. న్యాయమూర్తి పది మందికి రూ.32,300 జరిమానా విధించారని తెలిపారు.

ఏలూరులో రూ.9.50 కోట్లతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్

ఏలూరు రూరల్ : ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసేందుకు రూపొందించిన ప్రణాళిక అమలు చేయనున్నామని ఏలూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించాలని ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌ను కోరామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ పనులకు నిధులు సేకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆదేశించారన్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అభివృద్ధి చేసేందుకు గతంలో రూ. 9.50 కోట్లతో ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందులో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ నుంచి రూ.2.75 కోట్లు, ఏలూరు ఎంపీ ల్యాండ్స్ నుంచి మరో రూ.2 కోట్లు మంజూరు కావాలన్నారు. మిగిలిన 50 శాతం నిధులు రూ.4.75 కోట్ల ఖేలో ఇండియా పథకం నుంచి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ నిధులతో 400 మీటర్ల సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌తో పాటు ట్రాక్ మధ్యలో షాట్‌పుట్, జావలిన్, డిస్కస్ ఏరియా అభివృద్ధి చేయాలన్నారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ఖేలో ఇండియా సెంటర్ అథ్లెట్లతో పాటు జిల్లాలో సాధన చేస్తున్న అథ్లెట్లకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

హాస్టళ్లలో మరమ్మతులు

ఏలూరు (టూటౌన్): కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు మేరకు అమీనాపేటలోని వసతి గృహాల సముదాయానికి సంబంధించి పరిసరాల శుభ్రత, వసతి గృహాల మరమ్మతులు నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయించడం, మురుగు కాలువల్లోని పూడికలను తీయించడంతోపాటు ప్రాంగణంలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించినట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్వీ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం–1లో పాడైపోయిన 3 మరుగుదొడ్ల తలుపులు, ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం– 2లో పాడైపోయిన 6 మరుగుదొడ్ల తలుపులు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్టు బీసీ సంక్షేమాధికారి నాగరాణి తెలిపారు.

దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు

- దోమల నిర్మూలనకు సామూహిక చర్యలు
- ఈ నెల 30 వరకు అవగాహన కార్యక్రమాలు
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతపై ప్రదర్శనలు



దెందులూరులో ఫాగింగ్ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



దెందులూరులో బ్లీచింగ్ చల్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

దెందులూరు: ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయడానికి ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రే చేయాలని గ్రామీణ ప్రజలకు సూచిస్తున్నారు. గంబూషియా చేపలను వదలడం ద్వారా నీటిలోని లార్వాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. ఇళ్లల్లోని గోడలపై సింథటిక్ పైరిత్రాయిడ్ అవసరాన్ని బట్టి దోమల మందులను స్ప్రే చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.

మలేరియా లక్షణాలు

అనాఫిలిస్ దోమల ద్వారా చలి జ్వరం వ్యాపిస్తుందని చెబుతున్నారు. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటున్నారు. దీనిలో వైనాక్స్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్సీఫారం మలేరియా ఎక్కువగా బాధించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు వివరిస్తున్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయంటున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రక్త పరీక్షల ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చని పేర్కొంటున్నారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



మలేరియా వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అవగాహన ర్యాలీలు నిర్వహించడంతో పాటు ముంపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు వెళ్లి ముంపునీటిని వెంటనే తొలగించాలని చెబుతున్నాం. దోమల నిర్మూలన మందు పిచికారీ చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపడుతున్నాం.

– డాక్టర్ సుధాకర్, సూపరింటెండెంట్, దెందులూరు పీహెచ్‌సీ

పరిసరాల శుభ్రత పాటించాలి



మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే ఆడ దోమల వ్యాప్తి స్థానిక పరిసరాల అపరిశుభ్ర పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. రక్త మార్పిడి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. రోగులు వైద్యుల సూచనలను పాటించాలి.

– డాక్టర్ ప్రవీణ్, పోతునూరు సీహెచ్‌సీ

నేటి నుంచి శిక్షణ తరగతులు

దెందులూరు: ఈ నెల 8, 9 తేదీల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీలకు సంబంధించి 10 అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, మండలానికి సంబంధించి ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉప సర్పంచ్, ఒక మహిళా వార్డు మెంబర్, ఒక పురుష వార్డు మెంబర్ తప్పని సరిగా శిక్షణ తరగతులకు హాజరు కావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరుపై శిక్షణ తరగతులు

ఉంగుటూరు: పంచాయతీ ఉప సర్పంచి, వార్డు సభ్యులకు ఈనెల 8,9 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరు,, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై వారికి శిక్షణ ఇవ్వడంతోపాటు అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈశిక్షణ సమావేశాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు ప్రారంభిస్తారని తెలిపారు.

నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ

భీమడోలు: భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8, 9వ తేదీల్లో రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్య అభియాన్ కార్యాచరణ ప్రణాళిక 2024–25పై రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి సోమవారం అన్నారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పంచాయతీల్లోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



నిడమర్రు: ;పెదనింద్రకొలను తూర్పుపేటలో రాజేశ్వరి అలంకరణలో అమ్మవారు




నిడమర్రు: మండలపర్రులో మహాచండీ అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గామాత



దెందులూరు: చండీప్రియ అవతారంలో గోపన్నపాలెం కనకదుర్గమ్మ



భీమడోలు: గుండుగొలనులో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి



భీమడోలు: కురెళ్లగూడెంలో మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



దెందులూరు: మేకాలమ్మ చెరువుగట్టుపై కొలువైన అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

దెందులూరు: దసరా ఉత్సవాలు వాడవాడలా ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం గోపన్నపాలెం కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు తోట రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, కమిటీ సభ్యులు చండీప్రియ అవతారంలో వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కళాకారుడు కొండేటి రాంబాబు నృత్యాలు, మ్యూజికల్ నైట్ అలరించాయి. దెందులూరు మేకాలమ్మ చెరువు గట్టు రోడ్డులో స్థానికులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు.

వైభవంగా శరన్నవరాత్రులు

నిడమర్రు: మండలంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు సోమవారం తూర్పుపేట రామాలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరి అలంకరణలో మండలపర్రు పంచాయతన క్షేత్రంలో అమ్మవారు మహాచండి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

కనుల వేడుకగా ఉత్సవాలు

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవార్లకు భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయాల్లో స్వామి వారికి పంచామృత అభిషేక పూజలు, లక్ష కుంకుమార్చన చేశారు. గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎంపురం, భీమడోలు, నరెడ్లగూడెంలోని దుర్గామాతను దర్శించుకున్నారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, కురెళ్లగూడెంలో మహాచండీ దేవి దర్శనమిచ్చారు. పూళ్ల, ఎంఎంపురంలో భవానీ మాతను మహాచండీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

చల్లాలమ్మ ఆలయంలో చండీహోమం

ఉంగుటూరు: దేవీ నవరాత్రి పూజలు ఉంగుటూరులో వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామ దేవత చల్లాలమ్మ ఆలయంలో సోమవారం చండీ హోమం నిర్వహించారు. రెడ్డి చందు భవాని ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సూరత్తులు శ్రీను ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. చండీ హోమంలో భక్తులు, భవానీ దీక్షా ధారులు పాల్గొన్నారు. స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో నెలకొల్పిన కనకదుర్గమ్మకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం మహా చండీ దేవి అమ్మవారికి పూజలు చేశారు. కై కరంలో అమ్మవారిని సోమవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు దర్శించుకుని పూజలు చేశారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందటానికి నవంబర్ 6 తేదీ చివరి గడువు అని ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్ అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి సుమతి అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధితో కలిసి ఆయన అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ పూర్తి ఆధారాలతో సమర్పించి ఎమ్మెల్సీ ఓటు హక్కును పొందవచ్చున్నారు. నిర్దేశించిన కేంద్రాల్లో ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలు తహసీల్దార్ కార్యాలయం, మీసేవ ఆన్‌లైన్ సెంటర్‌లో తెలుసుకోవచ్చున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ హేమమాలిని, బీజేపీ దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ కృష్ణ చైతన్య, మండల కన్వీనర్ బుజ్జి గోపాల్, టీడీపీ దెందులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు ఉన్నారు.

దుండగులపై కేసు నమోదు చేయాలి

- పంచాయతీ వద్ద శిలాఫలకం ధ్వంసంపై ఏఎస్పీకి ఫిర్యాదు



ఏఎస్పీ సూర్యచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సంతోష్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా దెందులూరు మండలం ముప్పవరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ కోరారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నక్కా సూర్యచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తమ గ్రామంలోని సమస్యలపై జిల్లా అదనపు ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్, ఏడుగురు వార్డు సభ్యులతో కూడిన శిలాఫలకాన్ని రాజకీయ కక్షతో కొంత మంది దుండగులు కావాలనే ధ్వంసం చేశారని తెలిపారు. ఈ సంఘటనపై 5న దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశామని నిందితులను గుర్తించి, కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. దీనిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు పెదవేగి సీఐకు ఈ కేసు పరిష్కారానికి సూచనలు చేశారని తెలిపారు.

23 నుంచి దీక్షాధారులకు భిక్ష ఏర్పాటు



ఉచిత భిక్ష కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అన్నదాన సమాజం సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 23వ తేదీ నుంచి నగర పరిసర ప్రాంతాల్లో అయ్యప్ప దీక్షతో పాటు భవానీ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి తదితర దీక్షలు తీసుకున్న స్వాములకు భిక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్లు అన్నపూర్ణ సహిత హరిహర పుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం అధ్యక్షుడు కొట్టు మధు తెలిపారు. స్థానిక రామకోటి ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సమాజం ఆధ్వర్యంలో గతేడాది నుంచి స్వాములకు భిక్ష కార్యక్రమం ప్రారంభించామని, దాని కొనసాగింపుగా ఈ ఏడాది ఈ నెల 23 నుంచి డిసెంబర్ 16వ తేదీ వరకూ 55 రోజుల పాటు ఈ ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ సుమారు 2 వేల మందికి భిక్ష వడ్డిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ఈ నెల 12న పందిరి రాట వేస్తామన్నారు. ప్రజలు సైతం స్వాములకు భిక్ష పెట్టాలనుకుంటే ఒక రోజుకు రూ.10,116 కమిటీకి చెల్లిస్తే దాతలు కోరిన రోజున వారి పేరున స్వాములకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కమిటీ ప్రతినిధులు సామర్ల కిరణ్ కుమార్, మద్దుల శ్రీనివాస్ గోపాల్, కొట్టు మనోజ్, వీరమాచనేని చందు, చలువాది పవన్ కుమార్ పాల్గొన్నారు.

రహదారి చెంతనే చెత్త కుప్పలు



భీమడోలు జంక్షన్ ఓ కల్యాణ మండపం వద్ద పేరుకుపోయిన చెత్త



ఎం.నాగుపల్లి రోడ్డుపై ఓ వైపు పడేసి ఉన్న చెత్త

- దుర్వాసనతో ప్రయాణికులకు అదిరిపోతున్న ముక్కుపుటాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు జంక్షన్ నుంచి ఎం.నాగులపల్లి రోడ్డు చెత్త కుప్పలతో నిండిపోతోంది. నెలల తరబడి చెత్త రోడ్డుపై ఉండడంతో వర్షాలు కురిసి తడిసిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దీనితో ఆ రహదారిపై రాకపోకలు సాగించే వాహన చోదకులు, కాలినడక వెళ్లే భక్తులు భయపడిపోతున్నారు. ఇటీవల స్వచ్ఛభారత్ మిషన్ ఏర్పడి 10 ఏళ్ల పూర్తి చేసుకున్న నేపథ్యంలో స్వచ్ఛతా హీ సేవ - 2024 పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో గత నెల 17వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు కార్యక్రమాలను అట్టహాసంగా చేపట్టారు. గ్రామాలకే ఈ కార్యక్రమాలను పరిమితం చేశారు. వాస్తవంగా ఈ కార్యక్రమాన్ని ప్రకటనలకే పరిమితం చేశారు తప్ప క్షేత్రస్థాయిలో అమలు చేయలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరీ ముఖ్యంగా సంబంధిత అధికారులకు రహదారిపై కుప్పలు తెప్పలుగా పడి ఉన్న చెత్త కనిపించలేదు. కనీసం చెత్తా చెదారాలను వాహనాల్లో క్లాప్ మిత్రలతో డంపింగ్ యార్డ్‌కు తరలించిన పాపానే పోలేదు. ఇళ్లలోని నిరుపయోగకరంగా ఉన్న మట్టి, చెత్తను ఇక్కడే పడేస్తున్నారు. వర్షం కురిసి తడిసి అందులోకి వచ్చే దుర్వాసనతో రోడ్డుపై ప్రయాణించే వారి ముక్కు పుటాలు పగిలిపోతున్నాయి. ప్రధానంగా ఈ రహదారంతా ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఈ రహదారి భీమడోలు జంక్షన్‌కు దగ్గరగా ఉన్నందున భీమడోలు జంక్షన్‌లో కొబ్బరి బొండాల వ్యాపారులు తమ వ్యాపారం పూర్తి చేసుకుని వాటిని సంచుల్లో తీసుకువచ్చి ఈ రహదారి పక్కనే పడేస్తున్నారు. పంచాయతీ పరిధిలో ఇంటింటికీ సేకరించిన చెత్తను సైతం సిబ్బంది డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా రహదారి పక్కనే పడేసి చేతులు దులుపుకుంటున్నారు. చెత్తా నుంచి సంపద సృష్టించుకోవాలని ప్రభుత్వం సూచలను పంచాయతీలు పట్టించుకోవడం లేదు. రహదారిపై రాకపోకలు సాగించే వారు కలుషిత గాలిని పీల్చి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇకనైనా సంబంధిత పంచాయతీ అధికారులు శ్రద్ధ చూపి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.